


నవభూమి

పాలమూరు

అనుబంధం

28 మార్చి ,2025 శుక్రవారం పేజీలు:1

www.epaper.navabhoomi.in


## కొనసాగుతున్న
# సహాయక చర్యలు



**అచ్చంపేట, నవభూమి:-** దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మిగిలిన ఆరుగురి మృతదేహాల వెలికితీతకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. క్యాడవర్ డాగ్స్ మృతదేహాల ఆచూకిని గుర్తించడానికి మరోసారి లోపలికి వెళ్లాయి. రెస్క్యూ ఆపరేషన్ 34 వ రోజుకు చేరుకున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం నేపథ్యంలో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటిని నియమించింది. ఆయన ఇక్కడనే ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఆయన సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 రోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయక బృందాలు నిరంతరాయంగా కృషి చేస్తున్నాయని, రోజుకు మూడు షిఫ్టులుగా 600 మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. సహాయక బృందాల మధ్య సమన్వయంతో టన్నెల్‌లో ఉన్న మట్టి, టీబీఎం భాగాలు, ఊట నీటిని తొలగిస్తూ సహాయ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. వెలువడిన వ్యర్థ పదార్థాలను లోకో ట్రైన్ ద్వారా తరలించడంతో పాటు, అధిక సామర్థ్యం గల పంపుల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నట్లు వివరించారు. సహాయక సిబ్బందికి అవసరమైన ఆహారం, వసతి, ఆరోగ్య సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు కేరళకు చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్‌ను గురువారం ఉదయం 11 గంటలకు టన్నెల్‌లోకి పంపినట్లు శివశంకర్ వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, మేజర్ డాక్టర్ విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్ కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి ఎన్. చంద్ర, హైడ్రా అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులు, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, క్యాడవర్ డాగ్ ప్రతినిధి బృందం తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ అవార్డు గ్రహీతను
# సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

**దేవరకద్ర నవభూమి:-** డాక్టరేట్ అవార్డు పొందిన స్వచ్ఛంద సేవకుడు, దేవరకద్ర మాజీ ఎంపీటీసీ ఉస్కిల్ల వెంకట్రాములును దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వెంకట్రాములు గత కొంత కాలంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో ముందుంటున్నారు. మానవత్వ హృదయంతో పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు తన వంతుగా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. యువతకు క్రీడలలో రాణించడానికి తనవంతుగా ఆర్థిక సాయం చేస్తూ, ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అతడి సేవలను గుర్తించి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు తమిళనాడు రాష్ట్రంలోని ఊటీ సిటీలో గల హెచ్ఏడీపీ రిసోర్సు సెంటర్ ఫర్ ట్రైబల్ కల్చర్ హాల్‌లో వెంకట్రాములుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుబ్బలి ఆంజనేయులు, నాయకులు యుగంధర్ రెడ్డి. నవీన్ గౌడ్ ఎండీ ఖాజా తదితరులు ఉన్నారు.



## గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందాలన్నదే
# బిజెపి లక్ష్యం

◆ ఎంపీ నిధులతో పలు కార్యక్రమాలు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**కల్వకుర్తి మార్చ్ 27,నవభూమి:-** ఊర్కొండ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ నిధుల ద్వారా 5 లక్షలు ఊర్కొండ మండల కి సిసి రోడ్ల నిర్మాణానికి మరియు 2 లక్షలు, మొత్తం 7 లక్షలు మంజూరు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత కొంత కాలం నుండి ఎన్నో పార్టీల ఎంపీలు గెలిచారు కానీ హైదరాబాదు ఢిల్లీకే పరిమితమయ్యారు. ఎంపీ అంటే గ్రామాలను అభివృద్ధి చేసే పతంలో నడిపించే విధంగా మన అరుణమ్మ మనకు ఎంపీ కావడం మన అదృష్టం రానున్న రోజుల్లో కూడా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనుల కోసం నిధులను మంజూరు చేసి అభివృద్ధి పథంలో గ్రామాలను ఉంచేలా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్,మండల నాయకులు ఆంజనేయులు, మాజీ సర్పంచులు,మాజీ వార్డు మెంబర్లు ధర్మేందర్ రెడ్డి, శివయ్య,లక్ష్మణ్ కుమార్ గౌడ్, సందీప్ కుమార్,బండి మల్లేష్, కొమ్ము శ్రీను,రాచకొండ గోపి, ఆంజనేయులు,సంఘపగౌడ్, జగదీష్ గౌడ్,హరీష్,అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంచినీళ్లు కావాలంటే మురుగు నీటిలో నిలబడాల్సిందే

**మక్తల్, నవభూమి:-** తాగునీటి ట్యాంకుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాల్సిన పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నది. మురుగులోనే తాగునీరు పట్టుకోవాల్సిన పరిస్థితి మక్తల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయానికి సమీపంలో ఉన్న తాగునీటి ట్యాంకు వద్ద డ్రైనేజీలోని మురుగు నీరు ప్రవహిస్తున్నది. దీంతో అ పరిసర ప్రాంతాలు దుర్గంధం వెదజల్లుతున్నదని అక్కడే మంచినీళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించాల్సిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వీడి తాగునీటి ట్యాంకు వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

